క్లుప్తంగా

మస్తానకుంట చెరువులోకి సాగర్ జలాలు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో మస్తానకుంట చెరువులోకి ఎత్తిపోతల పథకం ద్వారా బుధవారం సాగర్ జలాలు చేరాయి. ఈ సందర్భంగా చెరువు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు రైతులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. సాగర్ జలాల రాకతో సాగుకు ఇక్కట్లు తీరతాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ తాత రఘురాంతో పాటు మానుకొండ రాధాకిషోర్, వాంకుడోత్ దీపక్, బండి వెంకన్న, రెంటాల ప్రసాద్, బాతుల సుధాకర్ రమణ, కొంటెముక్కుల నాగేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, భద్రునాయక్, ఉపేందర్ నాయక్, దొంతబోయిన శ్రీను, లింగా, బిచ్చనాయక్, పిల్లలమర్రి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడిలో ఇటీవల మరణించిన హుస్సేన్ కుటుంబాన్ని బీజేపీ నాయకుడు గుత్తా వెంకటేశ్వర్లు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాకూమియా, కణతాల కల్యాణ్, సచ్చు వీరబాబు పాల్గొన్నారు.

బీఎస్పీ పాలేరు డివిజన్ అధ్యక్షుడిగా రమేష్



నియామకపత్రం అందుకుంటున్న రమేష్

తిరుమలాయపాలెం: బీఎస్పీ పాలేరు డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన ఎన్నబోయిన రమేష్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలకేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జి చెరుకుపల్లి నాగేశ్వరరావు అయితగాని శ్రీనివాస్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ... తనని ఎంపిక చేసిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ అన్ని రంగాల్లో సమానమైన న్యాయం బీఎస్పీతోనే సాధ్యమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజ్, ఇన్‌చార్జి బుర్ర ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కొమ్ము పూలే, పోలేపొంగు మాల్సూర్, నల్లగట్టు శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీజేఎస్ బలోపేతానికి కృషి చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ జనసమితి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ వి.బాబు కోరారు. ఈ మేరకు బుధవారం ఖమ్మంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి త్వరలో పూర్తిస్థాయి కమిటీ వేసి పార్టీ నిర్మాణానికి కార్యకర్తలు అందరూ విస్తృతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాకిస్తాన్ యుద్ధంలో మరణించిన జవాన్ మురళి నాయక్‌కు సంతాపం తెలియజేశారు. ఈ సమావేశంలో నాయకులు జంగిపల్లి రవి, నరసింహారావు, మోహన్, రాజేందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	# సింగిల్, రెట్రో, జింఖానా
సాయిరాం	జగదేకవీరుడు అతిలోక సుందరి, తండర్‌బోల్ట్స్
ఆదిత్య	శుభం, అర్జున్ S/o వైజయంతి
శ్రీనివాస	దేశముదురు, తుడారమ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	38		20
కాకర	56	చుక్కకూర	3
బీర	56		20
దొండ	28	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	108	గోంగూర	4
గోరుచిక్కుడు	46		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	60		20
బీట్‌రూట్	34	-ఖమ్మం వ్యవసాయం	

పాడి పరిశ్రమకు సౌర లబ్ధి



ఖమ్మం పాడి పరిశ్రమలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్

ఎంతో ప్రయోజనం



సోలార్ విద్యుత్ ఖమ్మం పాడి పరిశ్రమకు ఎంతగానో ప్రయోజనం కలిగిస్తుంది. ప్లాంట్ నిర్వహణతో విద్యుత్ చార్జీల భారం కొంత మేరకు తగ్గింది. విద్యుత్ సంస్థ యూనిట్‌కు రూ.7.65 చార్జి విధిస్తుండగా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో ఉత్పత్తయ్యే విద్యుత్‌కు రూ.3.90 చొప్పున చెలిస్తోంది. ఈ విధానంతో పాడి పరిశ్రమకు నెలకు రూ.40 వేల లబ్ధి చేకూరుతుంది.

– పి.మోహన మురళి, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా పాడి పరిశ్రమ సంస్థ

రూ.80 లక్షలతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు

- 150 కిలోవాట్ల ప్లాంట్ నుంచి విద్యుదుత్పత్తి
- నెలకు రూ.40 వేల విద్యుత్ బిల్లు ఆదా

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం ప్రభుత్వ పాడి పరిశ్రమకు సోలార్ విద్యుత్ లబ్ధి చేకూర్చుతుంది. పాడి పరిశ్రమ యూనిట్‌లో సోలార్ ప్లాంటును నెలకొల్పటంతో సంస్థకు విద్యుత్ చార్జీల భారం తగ్గింది. సోలార్‌విధానం అమలుతో ఖమ్మం పాడి పరిశ్రమకు ప్రతీ నెలా సుమారు రూ.40 వేలు ఆదా అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పాలను సేకరించి శీతలీకరించటం, నిల్వ చేయటం, పాల ఉత్పత్తులను తయారు చేసి వాటిని నిల్వచేయటానికి ఖమ్మం రోటరీనగర్‌లో పాడి పరిశ్రమ యూనిట్‌ను నెలకొల్పారు. పాల పదార్థాలు నాణ్యంగా ఉండటానికి పరిశ్రమలో కంప్రషర్లు, శీతలీకరణ యంత్రాలు, బ్రాయిలర్లు, ప్యాకింగ్ యంత్రాల నిర్వహణకు విద్యుత్ తప్పనిసరి. పరిశ్రమ నిర్వహణలో విద్యుత్ వినియోగానికి ప్రతీ నెలా సీజన్ బట్టి రూ.2.50 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా పాడి యూనిట్లకు ప్రతీ నెలా విద్యుత్ బిల్లుల మోత ఉండటంతో ప్రత్యామ్నాయంగా అందుబాటులోకి వచ్చిన 'సోలార్ విద్యుత్' వినియోగానికి ముందుకొచ్చింది. దీనిలో భాగంగా ఖమ్మం పాడి యూనిట్‌లో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు అవకాశం ఉండటంతో రాష్ట్ర సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

విద్యుత్ బిల్లు ఆదా..

సోలార్‌విద్యుత్ ప్లాంటు ఏర్పాటు ఆధారంగా ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్యకు నెలకు సగటున రూ.40 వేల వరకు ఆదా అవుతుంది. పరిశ్రమ నిర్వహణకు సీజన్, పాల సేకరణ ఆధారంగా నెలకు రూ. 2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు విద్యుత్ వినియోగం ఖర్చవుతుంది. పరిశ్రమలో సోలార్ ప్లాంటు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి ఎన్పీడీసీఎల్ సంస్థ గ్రిడ్‌కు సరఫరా చేస్తున్నారు. ఈ విధానంలో పరిశ్రమకు నెలకు రూ.40 వేల వరకు ఆదా అవుతోంది. ఈ ఏడాదిగా సుమారు రూ.5 లక్షల వరకు ఆదా అయ్యింది.

పరిశ్రమ ప్రాంగణంలోని ఐదెకరాల్లో..



ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ

పరిశ్రమ ప్రాంగణంలోని ఐదెకరాలలో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఉప సంచాలకులు కార్యాలయం వెనుక భాగాన రూ. 80 లక్షల వ్యయంతో 150 కిలో వాట్ల సామర్థ్యం ఉన్న విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను నెలకొల్పారు. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను వినియోగించుకుని ఓ ఏజెన్సీతో సోలార్ ప్యానెల్స్‌తో నిర్మాణాలను చేపట్టారు. ప్లాంట్ చుట్టూ రక్షణగా కంచెను కూడా నిర్మించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన మీటర్లను కూడా ఈ ప్లాంటు ఆవరణలోనే ఓ భాగంగా ఏర్పాటు చేశారు. 2024 మే 15 నుంచి ఈ ప్లాంటును నిర్వహణలోకి తీసుకొచ్చారు. 25 ఏళ్ల నిర్వహణ ఒప్పందంతో పాడి పరిశ్రమలో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేశారు.

ఆడపిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు



దంపతులను సన్మానిస్తున్న అధికారులు

రఘునాథపాలెం: ఆడపిల్లల భద్రత, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా కట్టుబడి పని చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.పురంధర్ అన్నారు. 'మాపాప మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోయచలక గ్రామంలో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను దాట్ల గోపి రమ్యశ్రీ దంపతులను సన్మానించారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ పర్వీన్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఇంటికి ఆడపిల్ల వరం..



నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: ప్రతీ ఇంట్లో ఆడపిల్ల పుట్టటం ఓ వరమని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు అన్నారు. 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఆడపిల్లలు పుట్టిన ఇళ్లకు వెళ్లి చిన్నారులను ఆశీర్వదించి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో జె.రత్నకుమారి, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, సూపర్‌వైజర్ నాగమణి, పంచాయతీ కార్యదర్శి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

ఆడపిల్ల ఇంటికి మణిదీపం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కూసుమంచి: ఆడపిల్ల పుడితే ఆనందించాలని, వారే ఇంటికి మణిదీపమని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీలత అన్నారు. 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన పిట్టల రాధా–నవీన్ దంపతులకు ఆడబిడ్డ పుట్టగా వారి ఇంటికి అధికారులు వెళ్లి దంపతులను సన్మానించారు. వారికి పండ్లు, స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీడీపీఓ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలకేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని నాయకులు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకవెళ్లడంతో మంత్రి ఆదేశాలతో అధికారులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఏపీఓ నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న అధికారులు

పథకాల అమలులో రాజకీయ వివక్ష తగదు



కేఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ ఆధ్వర్యంలో కేఎంసీ ముట్టడి..

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ పథకాల అమలులో రాజకీయ వివక్ష తగదని, సంపద పెంచి పేదలకు పంచుతామని చెబుతున్న ప్రభుత్వం ముందుగా సంక్షేమ పథకాలను పేదలందరికీ వర్తింపజేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. కేఎంసీలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలో చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులకు కార్యకర్తలకు నడుమ తోపులాట జరిగింది. గేట్లు ఎక్కి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన సీపీఐ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సీపీఐ కార్యకర్తలు కార్యాలయం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తుందని, ఇందిరమ్మ ఇళ్లను అధికార పార్టీ నాయకులకే కేటాయించడం ఏ మేరకు సమాంజసమని ప్రశ్నించారు. పట్టణంలో అనేక ఏళ్లుగా రెక్కల కష్టంపై ఆధారపడి జీవిస్తున్న పేదలందరికీ ఇళ్లు కేటాయించాలన్నారు. అనంతరం ఏఎంసీ అహ్మద్ షఫీ ఉల్లాకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శి జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, జ్వాల నర్సింహారావు, తోట రామాంజనేయులు. మేకల శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

వైరా: సీబీఎస్ఈ పది, 12వ తరగతుల ఫలితాలు మంగళవారం విడుదల చేయగా, వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షలకు 172 మంది బాలబాలికలు హాజరు కాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. వీరిలో బండి రమ్యశ్రీ, ఏలూరి త్రియ 97 శాతం, గూడూరి ఊహిత, అంచూరి అంజలి 96, డి.సాత్విక చౌదరి 95, మేడా చర్విత, మణికంఠ, మేఘన 94 శాతం సాధించినట్లు తెలిపారు. అలాగే, 12వ తరగతి ఫలితాల్లో 48 మందికి గాను 100 శాతం ఉత్తీర్ణత నమోదైందని, బోజెడ్ల తేజశ్రీ 90శాతం మార్కులతో టాపర్‌గా నిలిచిందని వెల్లడించారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు చైర్మన్ ఐతా.రమణారావు, డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏఓ నర్సింహారావు అభినందించారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రపంచ ప్రసిద్ధధార్మిక పండితులు హజరత్ మౌలానా మొహమ్మద్ వస్తానవి సంతాప సభ ఈ నెల 18 న ఖమ్మంలో జరుగనున్న సందర్భంగా, సభ వాల్‌పోస్టర్లను బుధవారం ఖమ్మం బీకేబజార్ జైన్ మసీదులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, ఇమామె ఖతీబ్ మోతి మసీద్ మౌలానా అబ్దుల్ ఘని రషాది, హాఫిజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్, ముఫ్తీ అబ్దుల్ ఖలీక్, హాఫిజ్ ఇమ్రాన్, సాద్, మౌలానా జబీయుల్లా ఖాస్మి, సయ్యద్ ఫరూక్ హుస్సేని, ఫర్హాన్ పాల్గొన్నారు.

నివాళి, పరామర్శ..

ఖమ్మం సహకారనగర్: నగరానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పసుమర్తి రామచంద్రరావును మౌంట్‌ఫోర్ట్ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు గుండాల కృష్ణ బుధవారం పరామర్శించారు. రామచంద్రరావు సతీమణి కోటిరత్నం మరణించటంతో ఆమె మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వంజాకు లక్ష్మీనారాయణ, కోశాధికారి రమేష్, బాధ్యులు రమేష్‌బాబు, సంతోష్, తిరుమలరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న గుండాల కృష్ణ

ప్రతీ చెరువుకు సాగర్ నీళ్లు

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి నాగేశ్వరరావు

రఘునాథపాలెం: మండలంలోని ప్రతీ చెరువుకూ సాగర్ జలాలు, ప్రతీ గ్రామంలో రోడ్లు, ఇతర అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చింతగుర్తి ఎస్సీ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించే డ్రెయిన్ల పనులకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి పనులతో పాటే నాణ్యతను ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించాలని, రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని సూచించారు. కాగా, చింతగుర్తిలో వాగుపై స్లాబ్ కల్వర్టు నిర్మాణంలో జాప్యాన్ని స్థానికులు వివరించగా పంచాయతీరాజ్ ఈఎన్సీతో ఫోన్‌లో మాట్లాడి పనులు పునఃప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ, ఆత్మ కమిటీల చైర్మన్లు తాతారావు, చిన్న వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువాల దుర్గాప్రసాద్‌తో పాటు వాంకుడోత్ దీపక్, మానుకొండ రాధాకిషోర్, తమ్మినేని నాగేశ్వరరావు, ధరావత్ రామ్మూర్తి, కేతినేని సీతారామయ్య, కొమురయ్య, విశ్వనాథ్, భాగం లక్ష్మీనారాయణ, పేరపాక శ్రీను, మాలోత్ వెంకన్న పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



సూచనలు చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 25వ డివిజన్‌లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ బుధవారం పరిశీలించారు. కేఎంసీ జనరల్ ఫండ్ నిధులు రూ.79 లక్షల వ్యయంతో సైడ్ డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు మేయర్ తెలిపారు. పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఏఈఈ బాబు, గోళ్ల వెంకట్, పార సత్యం తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులను పరిశీలించిన కమిషనర్..

నగరంలో నిర్మాణంలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

'మోదీ పాలనలో ఒరిగిందేమీ లేదు'



మాట్లాడుతున్న హేమంతరావు

నేలకొండపల్లి: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్ల గడుస్తున్న జలకు ఒరిగిందేమీ లేదని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవన్‌లో బుధవారం మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.. మోదీ కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో సీపీఐ సహకారంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, మల్లెబోయిన ఉపేందర్, కర్నాటి నళిని, నరసింహారావు, మాధవ్, కాశబోయిన అయోధ్య, పుల్లయ్య, నారాయణ, మమత, పాలపాటి అశోక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న విష్ణు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణు అన్నారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ జేఏసీ సమావేశంలో మాట్లాడుతూ... రోడ్డు రవాణా చట్టం 2019 రద్దు చేయాలని, ఆటో, మోటార్ ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్మిక చట్టాలను పరిరక్షించాలని కోరారు. డ్రైవర్లకు రాజీవ్ యువ వికాసం కింద ఉపాధి, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపేందర్, పాల్వంచ కృష్ణ, పెరబోయిన మోహనరావు, లక్ష్మీనారాయణ, సత్తార్ మియా, సలీం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు యూటీఎఫ్ మద్దతు

ఖమ్మం సహకారనగర్: ఈనెల 20న జరిగే జాతీయ సార్వత్రిక సమ్మెకు టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు.

జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడిమర్తి రవి జన్మదిన వేడుకలు మాదిగ ఉపకుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం రేవతి సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇటికాల లత, జేఏసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జిల్లా విజయకుమార్, జంగం వెంకయ్య, కృష్ణ, లక్ష్మి, సురేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తరింపజేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బోడేపూడి వెంకటేశ్వరరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లో మరింత విస్తరింపజేయాలని ట్రస్ట్ కమిటీ సభ్యులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు అన్నారు. మూడు నెలలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల ఉచిత టైలర్ శిక్షణా కేంద్రం మొదటి బ్యాచ్ పూర్తయిన సందర్భంగా బుధవారం ఖమ్మం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయంలో వందలాది మందికి సేవలందించామన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందాలని విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతీ నెలా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో వాసిరెడ్డి వీరభద్రం, ఎల్‌వీ.రావు, గోవిందరావు, శ్రీనివాసరావు, ట్రైనర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



ఊరేగింపులో భక్తులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహుడి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో మహిళలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించగా, అనంతరం ఆలయ అర్చకులు ముడుంబై మురళీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. రథం ముందు కోలాటాలు, భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నారు. రథోత్సవాన్ని చూసేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.